తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి

ఆదివారం 04 అక్టోబర్ 2026 | పేజీలు : 8

Follow :




# కల్లూరు మున్సిపాలిటీఅభివృద్ధి నా బాధ్యత

## ○ రెవిన్యూ శాఖ మంత్రి పొంగు లేటి



**కల్లూరు అక్టోబర్ 3 (జనంసాక్షి):** కల్లూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత నాదే అని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని మదిర బ్రాంచి కాలువ కట్టపైన పాత బస్టాండ్ సమీపాన జాతీయ ప్రధాన రహదారి నుండి విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వరకు 10 లక్షల రూపాయలతో నిర్మించే సిసి రోడ్డుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కల్లూరు మండలం నా సొంత గడ్డ ని ఈ మండల అభివృద్ధి మున్సిపాలిటీ అభివృద్ధి నాదే బాధ్యత అని త్వరలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కల్లూరు లోని సమస్యలు అన్ని తనకు వివరించారని వాటిని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్న దృష్టికి. తీసుకెళ్లానని వాటిని పరిష్కరిస్తానని మంత్రి హామీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎసిపి వసుంధర యాదవ్, మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి ప్రభాకర్ చౌదరి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి మున్సిపల్ కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు కనపర్తి శ్యామల రాజకుమార్, ఉబ్బన రాంబాయి, బీరవెల్లి మాధవ్,, యాస నాగమణి శ్రీకాంత్, జిల్లెల్ల స్వాతి భాస్కర్ రెడ్డి, భూక్యరాంబాయి దాసరి సుధారాణి, గుండ్ల పుల్లారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రుఅర్జున్ రావు, పట్టణ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, లక్కినేని కృష్ణ, బొల్లం రామారావు, తలపు రెడ్డి అనిమిరెడ్డి, ఆళ్లకుంట నరసింహారావు, గూగులోతు ప్రసాద్, పెద్ద బోయిన రామ నరసింహారావు, నల్లజాల కిషోర్, శిరసాని జమలయ్య, కెవిఆర్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన పనిచేసే జర్నలిజం అవసరం

## మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 3,(జనంసాక్షి):** ప్రజల పక్షాన పనిచేసే జర్నలిజం వ్యవస్థ అవసరమని రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టులు వృత్తి గౌరవాన్ని కాపాడేలా పనిచేయాలని సూచించారు.రాష్ట్ర మీడియా అకాడమి ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సామాజిక మాధ్యమాలపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని మెరుగైన జర్నలిజాన్ని ప్రజలకు అందించడంతో పాటు, జర్నలిస్టుల వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏఐ, సోషల్ మీడియా ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నల్లగొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టుల కోసం ఈ వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 12న నాగార్జునసాగర్‌లో

వార్తా లోపలి పేజీలో



# జిల్లాలో 352 కొనుగోలు కేంద్రాల గుర్తింపు

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలి

### కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్




వార్తా లోపలి పేజీలో

# కోర్టు కేసుల పెండింగ్ అంశాలపై కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్ష

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్




**కొత్తగూడెం క్రైమ్ ,అక్టోబర్ 03 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ కోర్టు డ్యూటీ అధికారులతో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలు, కేసుల పరిష్కారంపై సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు కేసులకు సంబంధించిన ప్రొటెస్ట్ పిటిషన్లను సక్రమంగా పర్యవేక్షించాలని, నేర విచారణ ప్రక్రియ నిబంధనలైన సీఆర్‌పీసీ 82, 83 ఉత్తర్వులకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్లను ప్రత్యేకంగా పర్యవేక్షించి, సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, దర్యాప్తు అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టుల నుంచి జారీ అయ్యే సమన్లను సకాలంలో అమలు చేయించి, ఎలాంటి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు, ఈ-పెట్టీ కేసులను వారంవారీగా సమీక్షిస్తూ, క్రమం తప్పకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ-ఎఫ్ఐఆర్, ఈ-ఛార్జ్‌షీట్లకు సంబంధించిన వివరాలను కోర్టు డ్యూటీ అధికారులు తమ పరిధిలోని కోర్టుల్లో సక్రమంగా పరిశీలించాలని, ఏవైనా లోపాలు లేదా పెండింగ్ అంశాలు ఉంటే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.కోర్టుల్లో ప్రతిరోజూ జరిగే కేసుల విచారణ వివరాలను సక్రమంగా నమోదు చేసి, ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని ఆదేశించారు. కోర్టు సంబంధిత పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు, దర్యాప్తు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. వచ్చే సమీక్షా సమావేశంలోపు పై అంశాలన్నింటిపై స్పష్టమైన పురోగతి సాధించాలని, పెండింగ్ కేసులు మరియు కోర్టు సంబంధిత అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ రాజు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాఘవయ్య, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.



# తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ & గేమ్స్ మీట్‌లో 9 పతకాలు సాధించిన జిల్లా పోలీస్ క్రీడాకారులు



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 03 (జనంసాక్షి)** తెలంగాణ 5వ పోలీస్ స్పోర్ట్స్ �డ గేమ్స్ మీట్? 2026లో క్లస్టర్?అ విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 9 పతకాలు సాధించారు. ఇందులో 3 బంగారు, 3 వెండి, 3 కాంస్య పతకాలు ఉన్నాయి. టెన్నిస్ విభాగంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఈ. విజయ్ బాబు టెన్నిస్ డబుల్స్‌లో బంగారు పతకం, సింగిల్స్‌లో వెండి పతకం సాధించారు. ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు, సీఐ పాల్వంచ కె. సతీష్‌లు టెన్నిస్ ఓపెన్ డబుల్స్, 40+ డబుల్స్‌లో బంగారు పతకాలు సాధించారు. కృష్ణారావు ఓపెన్ సింగిల్స్‌లో కాంస్య పతకం, కె. సతీష్ 40+ సింగిల్స్‌లో వెండి పతకం సాధించారు.బ్యాడ్మింటన్ విభాగంలో పీసీ జి. ప్రవీణ్ ఓపెన్ మెన్ సింగిల్స్‌లో, డబ్ల్యూపీసీ కె. నాగస్వరూప ఓపెన్ ఉమెన్ సింగిల్స్‌లో కాంస్య పతకాలు సాధించారు. వీరిద్దరూ కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో వెండి పతకం సాధించారు. జిల్లా పోలీస్ క్రీడాకారులు సాధించిన ఈ విజయాలపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా సేవలందిస్తూ, క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు.

# సీనియర్ సిటిజన్ల హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

## న్యాయమూర్తి దీప్తి వేముల



**మధిర, అక్టోబర్ 3 (జనంసాక్షి):** సీనియర్ సిటిజన్ల హక్కులు, వారి సంక్షేమం మరియు వారికి చట్టపరంగా అందుబాటులో ఉన్న రక్షణలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మధిర కోర్టు న్యాయమూర్తి శ్రీమతి దీప్తి వేముల అన్నారు. శనివారం మధిరలో నిర్వహించిన సీనియర్ సిటిజన్ల హక్కులపై మధిర పీఆర్టీయూ కార్యాలయంలో జరిగిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీనియర్ సిటిజన్లను గౌరవించడం మన సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా, వారికి చట్టం కల్పించిన హక్కులను పరిరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని న్యాయమూర్తి పేర్కొన్నారు. Maintenance and Welfare of Parents and Senior Citizens Act, 2007, 2007 ద్వారా తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లకు కల్పించిన హక్కులను ఆమె వివరించారు. తమను తాము పోషించుకోలేని తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు చట్టపరమైన నిబంధనల ప్రకారం మనోవర్తి కోరవచ్చని తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్ల ఆస్తి హక్కులు, ఆస్తి బదిలీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలు లేదా బంధువుల ద్వారా నిర్లక్ష్యం లేదా వేధింపులు ఎదురైతే అందుబాటులో ఉన్న చట్టపరమైన పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్లు తమ హక్కుల విషయంలో మౌనంగా ఉండకుండా, అవసరమైనప్పుడు పోలీసులు, సంబంధిత అధికార యంత్రాంగం, న్యాయస్థానాలు మరియు న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించాలని సూచించారు. వృద్ధులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, వారు కుటుంబానికి మరియు సమాజానికి అందించిన సేవలను గుర్తించి, వారి వృద్ధాప్యాన్ని గౌరవప్రదంగా, భద్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈకార్యక్రమం లో సీనియర్ న్యాయవాది వాసంశెట్టి కోటేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్రహం, కార్యదర్శి రామబ్రహ్మాచారి, మాదవరపు నాగేశ్వరరావు, పారుపల్లి వెంకటేశ్వరరావు, చెన్నంశెట్టి మందయ్య తదితరులు సిటిజన్ల హక్కులపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.





అలంకారప్రాయంగా మారిన సెంట్రల్ లైటింగ్

- సంవత్సరాలుగా వెలగని లైట్లు
- రాత్రైతే జాతీయ రహదారి చీకటి మయం
- ప్రాణాలుపోతున్నా పట్టించుకోని నిర్వాహకులు

పెనుబల్లి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) : జాతీయ రహదారి సెంట్రల్ లైటింగ్ అలంకార ప్రాయంగా మారింది. విజయవాడ -

# జనం సాక్షి స్టేట్ ఎడిషన్ లో వచ్చిన కథనానికి సెంట్రల్ లైటింగ్ మరామత్తులు..

### కొద్ది రోజుల్లోనే సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ పునరుద్ధరణ..

### ఎన్ హెచ్ మెయింటెనెన్స్ గుత్తేదార్ వెల్లడి..

**పెనుబల్లి,అక్టోబర్ 3 (జనంసాక్షి ):** జాతీయ రహదారిపై పై ఏళ్ల తరబడి వెలగని సెంట్రల్ లైటింగ్ పై జనం సాక్షి వార్తాపత్రిక స్టేట్ ఎడిషన్ లో "అలంకార ప్రాయంగా మారిన సెంట్రల్ లైటింగ్"అనే హెడ్డింగ్ తో వచ్చిన కథనానికి స్పందనగా జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ మరామత్తులు చేపట్టారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల పరిధిలోని జాతీయ రహదారి పై లక్షలాది రూపాయల వ్యయం తో నిర్మించిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని గత రెండు మూడు సంవత్సరాలుగా వెలగడం ఆగిపోయాయి. ఫలితంగా జాతీయ రహదారి చీకటిమయం అయిపోయింది. రాత్రి వేళల్లో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు, అనేక రోడ్డుప్రమాదాలు చోటు చేసుకున్నాయి, సెంట్రల్ లైటింగ్ స్తంభాలు నడిరోడ్డుపై అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. జనం సాక్షి వార్తాపత్రికలో సెప్టెంబర్ 29 న అలంకారప్రాయంగా మారిన సెంట్రల్ లైటింగ్ అనే టైటిల్ "సంవత్సరాలుగా వెలగని లైట్లు" "రాత్రి అయితే చీకటిమయం" "ప్రాణాలు పోతున్న పట్టించుకోని నిర్వాహకులు"అనే సబ్ టైటిల్ ళ్ల తొ వచ్చిన వార్తా కథనానికి జాతీయ రహదారి మెయింటెనెన్స్ సంస్థ గుత్తేదార్ స్పందించి అక్టోబర్ 2 తారీకు నుండి సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ మరామత్తులు చేపట్టారు. కొద్ది రోజుల్లోనే అస్తవ్యస్తంగా ఉన్న ఎలక్ట్రికల్ వైరింగ్ ను సరిచేసి, పోయిన ఎలక్ట్రికల్ బల్బులను వేసి సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను పునరుద్ధరణ చేస్తామని జనంసాక్షి వార్త పత్రికకు వివరించారు.

## శ్రీ చైతన్య లో 100 డేస్ ఆఫ్ స్కూల్ వేడుకలు

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 3 (జనంసాక్షి):** ఖమ్మం నగరం: మామిళ్ల గూడెం: శ్రీ చైతన్య పాఠశాల మామిళ్లగూడెం బ్రాంచ్‌లో 100 డేస్ ఆఫ్ స్కూల్ సెలబ్రేషన్స్ ఎంతో ఉత్సాహంగా నిర్వ హించారు. ఈకార్య క్రమంలో చిన్నారుల తోపాటు వారి అమ్మమ్మలు, నానమ్మలు, తల్లులు పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వివిధ ఆటలు వినోద కార్యక్రమాలు సరదా కార్యకలాపాల్లో పాల్గొని ఆనందించారు. మూడు తరాలవారు కలిసి గడిపిన ఈసమయం కుటుంబ అనుబంధాలను మరింత బలోపేతం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నీరజ మాట్లాడుతూ పిల్లల విద్యాభివృద్ధిలో పాఠశాలతో పాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ముఖ్యంగా తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు పిల్లల జీవితాల్లో అందించే ప్రేమ విలువలు అనుభవాలు ఎంతో అమూల్యమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్, ప్రిన్సిపాల్ నీరజ, ప్రీ-ప్రైమరీ కోఆర్డినేటర్ గౌతమి, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జి గీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు . పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## ఆశా మిత్ర లంకా కొండయ్యకు సన్మానం

**మధిర, అక్టోబర్ 3 (జనంసాక్షి):** మధిర పట్టణంలో వివిధ సంఘ సేవకులకు సలహాలిస్తూ, అనేక సాంఘిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా ఆరోగ్య శాఖలో తనదైన శైలిలో కళా ప్రదర్శనలు ఇస్తూ జన చైతన్యం చేస్తున్న హెల్త్ సూపర్ వైజర్, జానపద కళాకారుడు లంకా కొండయ్య గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక టీవీఎం హైస్కూల్ లోటీవీఎం ఈవినింగ్ వాకర్స్ క్లబ్, కోన సత్య నారాయణ గుప్త ఫౌండేషన్ సంయుక్తంగా లంకా కొండయ్యకు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో కోన నర్సింహారావు పల్ల పోతుల నర్సింహారావు, కోమిటీడీ శ్రీనివాసరావు, విశ్రాంత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కిలారు కామేశ్వరావు, ఇంకా ఈవినింగ్ వాకర్స్ క్లబ్ సభ్యులు మహిళా మణులు, నైస్ టైలర్ షేక్ జానీ మీడియా మిత్రుడు వేముల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిరలో మహాత్మాగాంధీ ఉచిత పాత బట్టల కేంద్రం ఏర్పాటు చేసి అనేకులకు దుస్తులు పంపిణీ చేయటం అభినందనీయం అని, గాంధీ జయంతి సందర్భంగా ఇలాంటి సంఘ సేవకుడిని సన్మానించు కోవటం ఆనందం అని వారు అన్నారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నాసేవలు గుర్తించి ఈ సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వహకులకు పేరు పేరునా హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

# వెదుళ్ల చెరువు అంగన్ వాడి కేంద్రానికి ఫ్యాన్, పలకలు అందజేత

### కీర్తిశేషులు మద్దినేని సీతయ్య జ్ఞాపకార్థం ఇప్పల వెంకట సాయికుమార్

### చిన్నారులకు పలకలు.. కేంద్రానికి ఫ్యాన్ అందజేత

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 3 (జనం సాక్షి):** తిరుమలాయపాలెం మండలం లోని వెదుళ్లచెరువు గ్రామం లోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్, చిన్నారులకు పలకలను ఇప్పల వెంకట సాయికుమార్ అందజేశారు. తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కీర్తిశేషులు మద్దినేని సీతయ్య జ్ఞాపకార్థం ఆయన మనవడు, ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న ఇప్పల వెంకట సాయికుమార్ తన సొంత ఖర్చులతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల సౌకర్యార్థం ఫ్యాన్‌తో పాటు పలకలను అందించడం పట్ల అంగన్వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు సాయికుమార్‌ను అభినందించారు. చిన్నారుల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రాధ, ఏఎన్ఎం నాగలక్ష్మి, ఆయా మరియమ్మ, అంగన్వాడీ చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

### నూతన గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**అశ్వాపురం, అక్టోబర్ 3 (జనంసాక్షి):** అశ్వాపురం మండలం తుర్రంవారిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నూతనంగా నిర్మించుకున్న ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. లబ్ధిదారులు బానోతు అచ్చమ్మ, బానోతు శైలజ కుటుంబాలను అభినందించి, నూతన గృహాల్లో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వం లో, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన కుటుంబాలకు గృహ వసతి కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, సంబంధిత హౌసింగ్ శాఖ అధికారులు, మండల అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కేటీపీఎస్ VII స్టేజ్ అకౌంట్స్ విభాగంపై విచారణ జరపాలి



**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 3 (జనం సాక్షి):** పాల్వంచ కేటీపీఎస్ VII స్టేజ్ అకౌంట్స్ విభాగంలో పోస్టులు, ప్రమోషన్లు, వాహన సౌకర్యాలు, బదిలీలకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ది నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూక రాజేష్ డిమాండ్ చేశారు. సాంక్షన్డ్ పోస్టులకు మించి సిబ్బంది పనిచేస్తున్నారనే ఆరోపణలు, వాహన వినియోగం, దీర్ఘకాలిక పోస్టింగులు, బినామీ కాంట్రాక్టులపై రికార్డులను పరిశీలించాలని కోరారు. కుల వివక్ష, మతపరమైన ఒత్తిళ్ల ఆరోపణలపైనా నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేటీపీఎస్ ఉన్నతాధికారులు, టీజీ జెన్‌కో సీఎండీ తక్షణమే స్పందించి అధికారిక వివరణ ఇవ్వాలని కోరారు.

# వేతన బకాయిలు చెల్లించాలని కార్మికుల ఆందోళన



టేకులపల్లి, అక్టోబర్ 3(జనంసాక్షి): కోయగూడెం ఓపెన్ కాస్ట్ లోని ఓవర్ బర్డెన్ పనులను నిర్వహించి న ఎల్ ఎస్ ఎన్ కంపనీ యాజమాన్యం కార్మికులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని శనివారం కార్మికులు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎల్ఎస్ఎన్ క్యాంపు లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎల్ఎస్ఎన్ యాజమా న్యులను తమ హక్కులు వేతనాలు బోనస్ఈపీఎఫ్ లపై నిలదీశారు. మాకు చెల్లిస్తామన్న వేతనాల బకాయిలు వాయిదాల మీద వాయిదాలు పెట్టి వాయిదాలు గడిచిపోతున్నప్పటికిని మాకు ఇవ్వక పోవడం ఏమిటని మండిపడ్డారు. ఇట్టి విషయంలో తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అతిపెద్ద పండుగ దసరా సమీపిస్తున్న మాకు రావాల్సిన బకాయిలను చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు చెల్లించేంతవరకు ఇక్కడ నుండి కదిలేది లేదని అన్నారు. వేతనాల కోసం కార్మికులు చేస్తున్న ఆందోళన విషయము తెలుసుకున్న బోడు ఎస్ఐ ఎల్ ఎస్ ఎన్ క్యాంపుకు చేరుకొని కార్మికులతో కార్మిక సంఘాల నాయకులు ఎల్ఎస్ఎన్ యాజమాన్యంతో చర్చించారు. ఇట్టి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఎల్ఎస్ఎన్ ప్రతినిధులు వివరించారు. మా సమస్య పరిష్కారం కానంత వరకు ఇక్కడ నుండి కదిలేది లేదని కార్మికులు అక్కడే మకాం వేసి కూర్చున్నారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను ఇప్పించే విధంగా సింగరేణి యాజమాన్యం పోలీస్ అధికారులు చొరవ చూపాల ని ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ ఐ ఎన్ టి యు సి నాయకులు బానోతు నరేష్ అన్నారు

ఈ కార్యక్రమంలో కార్మికులు బానోతు శంకర్, రఘురాం, శ్రీను, గోపాల్, గన్నా, వీరన్న, గోపి, పీకేవి ప్రసాద్, మోహన్, కటారి బాబు తదితరులు పాల్గొన్నారు.



# పైలట్ స్మిత్ మచ్చర్ కు త్రివేణి ఎన్‌సీసీ కేడెట్ల బిగ్ సెల్యూట్

**ఖమ్మం, అక్టోబరు 03, (జనంసాక్షి) :**
సాహసం, సమయస్ఫూర్తితో 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ కు ఖమ్మంలోని త్రివేణి పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు ఘనంగా అభినందనలు తెలిపారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేడెట్లు ఆయనకు సెల్యూట్ చేసి తమ గౌరవాభిమానాలను చాటుకున్నారు. విమానంలో అత్యవసర పరిస్థితి ఏర్పడిన వేళ, కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్ర గాయాలైనప్పటికీ చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులను సురక్షితంగా కాపాడారు. ఆయన చూపిన అసామాన్య ధైర్యసాహసాలు, బాధ్యతాయుత ప్రవర్తన దేశంలోని యువతకు, ముఖ్యంగా ఎన్‌సీసీ కేడెట్లకు ఎంతో స్ఫూర్తిదాయకమని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి గారు కొనియాడారు.?ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ… “ఆపద సమయంలో భయపడకుండా సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోవడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి. కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన వీరత్వం, సమయస్ఫూర్తి సమాజానికి ఎంతో ఆదర్శం” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ సందీప్ఉ, పాధ్యాయులు, ఎన్‌సీసీ కేడెట్లు మరియు విద్యార్థులు పాల్గొని పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ సాహసకృత్యాన్ని ప్రశంసించారు.



# గొర్రెలను కోల్పోయిన కుటుంబానికి అండగా నిలిచిన మాజీ మంత్రి

### రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత

**చౌటుప్పల్ అక్టోబర్ 3(జనం సాక్షి)**
**బీబీనగర్,** రైలు ప్రమాదంలో సుమారు 400 గొర్రెలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన గొర్రెల కాపరి కుటుంబానికి మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆర్థిక చేయూత అందించారు. మండలంలోని కొండమడుగు మెట్టు పరిధిలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో బాలబోయిన కిష్టయ్య యాదవ్, ఆయన కుమారులు నరసింహ, బాలయ్య, శేఖర్ కుటుంబాలకు చెందిన సుమారు రూ.50 లక్షల విలువైన గొర్రెలు మృతి చెందాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం తన నివాసంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తీవ్రంగా నష్టపోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు గొల్లకురుమలు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్ల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య యాదవ్, జిల్లా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ, గండు బిక్షపతి, కొత్తపల్లి జంగయ్య, జాల జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్వర్ వెంటనే రాజీనామా చేయాలి

### ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకులు ఈదురు వీర పాపయ్య



జాజిరెడ్డిగూడెం మండల **అక్టోబరు 03, (జనంసాక్షి) :**
సర్ లో అర్హులైన ఓటర్ల ఓట్ల తొలగింపులకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని అర్వపల్లిలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకులు ఈదురు వీర పాపయ్య డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించడం సరికాదన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు ప్రసాదించిన ఓటు హక్కు ప్రజల బతుకులను మార్చుకోవడానికి, ప్రజాప్రతినిధులను నిలదీయడానికి ఉపయోగపడే ఆయుధం. అలాంటి పవిత్రమైన ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలో పెద్ద సంఖ్యలో అర్హులైన ప్రజల ఓట్లు గల్లంతయ్యాయని ఆరోపించారు. తొలగించిన ప్రతి ఓటును ఓటరు జాబితాలో చేర్చే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరుగుతున్న సీజేపీ నిరసనలకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ఎంసీపీఐ(యూ) నాయకులు పాల్గొన్నారు.

# చిట్యాల ఫోటోగ్రాఫర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు




**చిట్యాల, అక్టోబర్ 03 (జనం సాక్షి):**
నల్గొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ యేళ్ల బయ్యన్న ఫోటోగ్రఫీ రంగంలో ప్రతిష్టాత్మక కళాపురస్కార్ అవార్డును అందుకున్నారు. సాంప్రదాయ ఫోటోగ్రఫీలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు ఆయనకు ఉత్తమ ట్రెడిషనల్ ఫోటోగ్రాఫర్ అవార్డు లభించింది. ఈ నెల 2, 3, 4 తేదీల్లో శంషాబాద్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఫోటోటె క్, ఎడిట్ పాయింట్ ఇండియా సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోటోగ్రఫీ ఎక్స్‌పోలో భాగంగా భారత్ కళాపురస్కార్ -26 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలో సాంప్రదాయ ఫోటోగ్రఫీ విభాగంలో యేళ్ల బయ్యన్న ప్రతిభ కనబరిచి ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం అభిమన్యు రెడ్డి, ఇప్పలపల్లి రమేష్ చేతుల మీదుగా యేళ్ల బయ్యన్న అవార్డును అందుకున్నారు. చిట్యాల ప్రాంతానికి చెందిన ఫోటోగ్రాఫర్ జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ వేదికపై అవార్డు అందుకోవడం పట్ల స్థానికులు, ఫోటోగ్రఫీ రంగానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

# శ్రీ శ్వేత హాస్పిటల్ లో అరుదైన ఆపరేషన్

### మహిళ కడుపులో 10 కేజీల కణితి తొలగింపు

### ఊపిరి పీల్చుకున్న బాధిత కుటుంబం

### ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ల కు అభినందన వెల్లువ

హుజూర్‌నగర్ అక్టోబర్ 3 (జనంసాక్షి): పట్టణంలోని లింగగిరి రోడ్ లో ఉన్న శ్రీ శ్వేత హాస్పిటల్ లో శనివారం డాక్టర్ శ్వేత అట్లూరి, డాక్టర్ జి సునీల్ కుమార్ లు మహిళ కడుపులో ఉన్న 10 కేజీల కణితి ని చికిత్స ద్వారా తొలగించారు. మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం కు గ్రామానికి చెందిన బానోత్ భజిని (45) మహిళ గత కొన్ని సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం హుజూర్‌నగర్ శ్రీ శ్వేత హాస్పిటల్ లో చేరగా డాక్టర్స్ శ్వేత అట్లూరి, డాక్టర్ జి. సునీల్ కుమార్ లు బాధిత మహిళకు అన్ని పరీక్షలు నిర్వహించి కణితి ని గుర్తించి మహిళ కడుపులోంచి 10 కేజీల కణితి ని ఆపరేషన్ ద్వారా తొలగించారు. ఇంత క్లిష్ట తరమైన ఆపరేషన్ ను తక్కువ ఖర్చుతో చేసిన హాస్పటల్ యాజమాన్యానికి, డాక్టర్స్ శ్వేత అట్లూరి, డాక్టర్ జి.సునీల్ కుమార్, హాస్పిటల్ సిబ్బందిని, బాధిత మహిళా కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# కబడ్డీ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టుకు చిట్యాల విద్యార్థినులు

**చిట్యాల, అక్టోబర్ 03 (జనం సాక్షి):**
అండర్?14 బాలక ల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిట్యాల ఠాగూర్ విద్యాలయం విద్యార్థినులు పి. ఐశ్వర్య, చి. అక్షర నల్లగొండ జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు.
జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం సంపాదించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, చిట్యాల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా విద్యాలయం కరస్పాండెంట్ పెద్ది నరేందర్, పీఈటీ లింగస్వామితో పాటు ఉపాధ్యాయ బృందం పి. ఐశ్వర్య, సి హెచ్ అక్షరలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

**భద్రాచలం అక్టోబరు 03 (జనంసాక్షి)**
భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర?బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర కల్యాణ ఘట్టాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద పండితుల వేద ఆశీర్వచనాలతో స్వామివారి కల్యాణం సంపూర్ణమైంది. ఈ వేడుకలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# ఘనంగా ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

**○ప్రారంభించిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి..**

**○ చెన్నయ్ షాపింగ్ మాల్ లో సినీనటి రితికా నాయక్ సందడి..**

**కోదాడ, అక్టోబర్ 3(జనంసాక్షి):**
కోదాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది చెన్నయ్ షాపింగ్ మాల్ ను స్థానిక శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి శనివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ కోదాడ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలకు అత్యాధునిక మోడల్స్, నాణ్యమైన వస్త్రాలు ఒకే చోట లభించేలా ది చెన్నై షాపింగ్ మాల్ అందుబాటులోకి రావడం సంతోషకరం అని అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలకు ప్రముఖ సినీనటి రితిక నాయక్ ప్రత్యేక అతిథిగా హాజరై సందడి చేశారు. మాల్‌లోని పలు విభాగాలను సందర్శించిన రితిక , నూతన వస్త్ర శ్రేణిని, డిజైన్‌లను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం వేదికపై పాటలకు సరదాగా స్టెప్పులు వేసి అక్కడున్న యువతలో ఎనలేని జోష్ నింపారు. సినీనటిని చూడటానికి, సెల్ఫీలు దిగడానికి అభిమానులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాల్ యాజమాన్యం ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి, నటి రితిక నాయక్ ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నెని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, కమిషనర్ రమాదేవి, స్థానిక కౌన్సిలర్



కోల్లా కోటిరెడ్డి, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, షాపింగ్ మాల్ నిర్వాహకులు మగ్రి వెంకటరెడ్డి పట్టణ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## బుల్లెట్ ట్రైన్ ధ్యేయంగా ఉద్యమాలను ఉధృతం చేయాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
బుల్లెట్ ట్రైన్ సాధనే ధ్యేయంగా ఉద్యమాలు ఉధృతం చేయాలని బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి పిలుపునిచ్చారు. బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమాలను జాతీయ రహదారి 65కు సమాంతరంగా ఉధృతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించాలని అన్నారు. మొదటి అలైన్మెంట్ ను కొనసాగించేందుకు ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. మనకు రావాల్సిన బుల్లెట్ ట్రైన్ ను కొందరు స్వార్థంతో పక్కదారి పట్టిస్తుంటే చూస్తూ నిర్లక్ష్యం చేసినట్లైతే కొన్ని దశాబ్దాల పాటు సూర్యాపేటకు రైలు మార్గం చూడలేమని అన్నారు. ఈ దీక్షలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి సభ్యులు చలమల్ల నర్సింహ, వెలుగు వనిత, అబ్దుల్ కరీం, నల్లేడ మాధవరెడ్డి, నాగయ్య, యర్కచర్ల శోభారాణి, పాల్గొనగా మండాది డేవిడ్ కుమార్, పెన్షనర్ ల సంఘం నాయకులు హమీద్ ఖాన్, జర్నలిస్టు భూపతి రాములు సంఘీభావం తెలిపారు.



## అటవీ భూమిలో అక్రమ పోడు సాగు యత్నానికి అడ్డుకట్ట - డోజర్ ట్రాక్టర్ స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు

**బూర్గంపహాడ్ అక్టోబర్ 03 (జనంసాక్షి)**
అటవీ భూమిని అక్రమంగా పోడు సాగులోకి మార్చేందుకు చేపట్టిన ప్రయత్నాన్ని అటవీ అధికారులు అడ్డుకున్నారు. అశ్వాపురం అటవీ రేంజ్ పరిధిలోని కృష్ణసాగర్ రిజర్వ్ ఫారెస్ట్, కంపార్ట్‌మెంట్ నంబర్ 225లోని నాగినేనిప్రోలు– రెడ్డిపాలెం బీట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అటవీ భూమిని సాగులోకి మార్చే ఉద్దేశంతో డోజర్ ట్రాక్టర్ ద్వారా భూమిని దున్నుతున్న చక్క ఈశ్వరయ్య, ట్రాక్టర్ డ్రైవర్ కమ్ యజమాని ఇనపెంగి నాగరాజును అటవీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. సుమారు 0.10 హెక్టార్ల విస్తీర్ణంలో 201 క్యూబిక్ మీటర్ల మేర భూమిని దున్నినట్లు అధికారులు గుర్తించారు. పోడు సాగు కోసం ఉపయోగించిన టీఎస్ 05 యూడీ 7803 నంబర్ గల డోజర్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, సంబంధిత అటవీ చట్టాల కింద కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు. అటవీ భూములపై అక్రమ ఆక్రమణలు, అనధికారిక సాగు, భూమి స్వరూపాన్ని మార్చే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అటవీ అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ దాడిలో అశ్వాపురం రేంజ్ అధికారి సత్తాజ్ అలీ, సారపాక డీఆర్ఓ కృష్ణ, రెడ్డిపాలెం బీట్ అధికారి లక్ష్మి ప్రసన్న, కృష్ణసాగర్ బీట్ అధికారి ఉపేంద్ర, సందెల్లపాడు బీట్ అధికారి భీమ్‌చంద్, సారపాక బీట్ అధికారి బాబురావు పాల్గొన్నారు.



## విద్యుత్ కోతలపై బీఆర్ఎస్ ఆందోళన

**రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే**

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 3 (జనం సాక్షి):**
మండల కేంద్రంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సబ్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ మడుగుల ప్రభాకర్‌రెడ్డి హాజరై బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు కనీసం 10 గంటల విద్యుత్ కూడా అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని సుమారు గంటన్నరపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, సర్పంచ్ సామ రవీందర్‌రెడ్డి, నాయకులు కందాడి భూపాల్‌రెడ్డి, రావుల శేఖర్‌రెడ్డి, నోముల మాధవరెడ్డి, పీసర్ల మహిపాల్‌రెడ్డి, ఫకీరు సుధాకర్‌రెడ్డి, ముత్యాల మహిపాల్‌రెడ్డి, చేరాల నరసింహ, గునిగంటి మల్లేశ్‌గౌడ్, తంగెళ్ల దశరథ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి గడ్డం వేణుగోపాల్ రెడ్డి



**మాడుగులపల్లి సెప్టెంబర్ 3 (జనంసాక్షి):**
మండల పరిధిలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మాడుగులపల్లి మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు ఓటు హక్కు నమోదు కోసం ఈ ఏడాది సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు మాత్రమే ఈ ఓటు హక్కు నమోదుకు అర్హులని చెప్పారు అర్హత కలిగిన వారు పూర్తి వివరాలతో కూడిన ఫారం?18 దరఖాస్తుతో పాటు కాన్వొకేషన్ లేదా ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, సాధారణ ఓటర్ ఐడీ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మొబైల్ నంబర్‌ను జతచేసి సమర్పించాలని సూచించారు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేయించుకోవాలని కోరారు.

## చింతకాని ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక..

**అధ్యక్ష కార్యదర్శులుగా కాశి బోయిన.రామారావు పెరిక. నాగేశ్వరరావు(నందు)**

**చింతకాని , అక్టోబర్ 03 (జనంసాక్షి)**




చింతకాని మండల నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గంను శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా కాశి బోయిన.రామారావు, పెరిక.నాగేశ్వరరావు (నందు) లు ఏకీగ్రవంగా ఎన్నికయ్యారు . ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ యూనియన్ బలోపేతానికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో జిల్లా టీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు లింగం రాంబాబు, గార్లపాటి రమేష్, మరియు చింతకాని ప్రెస్ క్లబ్ సభ్యులు మంద శివకృష్ణ, చిట్టూరి నరేష్, దేవరకొండ ప్రవీణ్, పోతగాని పుల్లారావు, ఇంటి ప్రసాద్, అలవాల వెంకట నరసయ్య, తూము నరసింహారావు, జొన్నలగడ్డ మల్లేశ్వరి సురేందర్ గడ్డం విజయ్ లను ఎన్నుకున్నారు,

# విద్యుత్ సమస్యలపై కోదాడ సబ్‌స్టేషన్ ముట్టడి

**చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన..**

**విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై రైతు ఆగ్రహం..**

**కోదాడ, సెప్టెంబర్ 3( జనం సాక్షి):**
?కాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మార్చకపోవడం, నిరంతర విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహించిన రైతులు శనివారం కోదాడ విద్యుత్ సబ్‌స్టేషన్ బైఠాయించి నిరసన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐమండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు ఆధ్వర్యంలో తమ్మర, గణపవరం, ద్వారకుంట, యతిరాజపురం తండా గ్రామాలకు చెందిన రైతులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు బయటకు వెళ్లకుండా అడ్డుకుని ఆందోళన నిర్వహించారు. అనంతరం?సిపిఐ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు మాట్లాడుతూ విద్యుత్ అధికారులు ఎడాపెడా కోతలు విధిస్తుండటంతో పాటు కాలిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఇవ్వడానికి నెలల తరబడి ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అరకొరగా ఇస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు కూడా నాణ్యత లేకపోవడంతో అమర్చిన కొద్ది రోజులకే కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పొట్టదశకు వచ్చి చేతికి అందే సమయంలో నీళ్లు లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాయపూడి కాటమరాజు, బత్తినేని శ్రీను, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, బండ్ల రంగయ్య, శ్రీరామ్ శ్రీను, నన్నే సాహెబ్, ముంద్రా సతీష్, మంగ్య, కాసాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు..



జనంసాక్షి

# ప్రజల వద్దకే సబ్ కలెక్టర్



## - సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల వినతుల స్వీకరణ
## - విద్యార్థులు, ఆటోడ్రైవర్లతో ముఖాముఖి



**భద్రాచలం అక్టోబరు 03 (జనంసాక్షి)**

ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐఏఎస్ ప్రత్యేక చొరవ చూపారు. తన కార్యాలయం వద్దకు వచ్చిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల నుంచి స్వయంగా వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం జెడ్పీహెచ్ ఎస్ (బాలికలు), భద్రాచలం పాఠశాలను సందర్శించి 8, 9, 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల చదువులు, మధ్యాహ్న భోజనం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. 12వ తరగతి అనంతరం ఉన్నత విద్య, వివిధ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఐఐటీ-జేఈఈ, నీట్ , సీయూఈటీ వంటి ప్రవేశ పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్ ను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని, ఆన్ లైన్ విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. ప్రస్తుత కాలం లో ప్రాధాన్యం పెరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , మైక్రోసాఫ్ట్ ఆఫీస్ వంటి అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యమిస్తూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.తరువాత బ్రిడ్జి పాయింట్ ఆటో స్టాండ్ ను సందర్శించిన సబ్ కలెక్టర్ ఆటో డ్రైవర్లతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైవర్లకు బీమా సౌకర్యం, సురక్షిత డ్రైవింగ్ , పిల్లల విద్య తదితర అంశాలపై చర్చించారు. ఆటో స్టాండ్ వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాల పాల్వంచలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు, యూనిఫాంలు & ఐడీ కార్డుల పంపిణీ

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 03 (జనం సాక్షి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నాడు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు, ఏకరూప దుస్తులు (యూనిఫాంలు) పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ శ్రీ శంకర్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీ హెచ్. వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం జిల్లా ఇంటర్ విద్యాధికారి హెచ్. వెంకటేశ్వరరావు విద్యార్థులకు కళాశాల ప్రాంగణం, అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో కీలకమైన పునాది అని, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి మెరుగైన ఫలితాలు, వ్యక్తిత్వ వికాసం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.?బసవతారక కాలనీ గ్రామ సర్పంచ్ జర్పుల కాశమ్మ: విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని చదువుపై శ్రద్ధ వహించాలని, విద్యతో పాటు నైతిక విలువలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిడిపాక ప్రిన్సిపాల్ శ్రీ సత్యనారాయణ కూడా పాల్గొని ప్రసంగించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా అందించిన యూనిఫాం బైలు, బెల్టులు, బ్యాడ్జీలు, ఐడీ కార్డులను జిల్లా విద్యాధికారి, సర్పంచ్, ప్రిన్సిపాల్ కలిసి విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్లకు ఆత్మీయ స్వాగతం పలికారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా అలరించాయి.ఈ వేడుకల్లో సీనియర్ అధ్యాపకులు ఎస్. నాగేశ్వరరావు, జి. గోపాలకృష్ణులతో పాటు కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదం లో ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

**చౌటుప్పల్ అక్టోబర్ 3(జనం సాక్షి)**



విజయవాడ? హైదరాబాద్ ప్రధాన రహదారిపై తూప్రాన్‌పేట్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నకిరేకల్ మండలం వల్లభాపురానికి చెందిన కాడింగు యాదగిరి (26), రాచకొండ గణేష్ (28), కొరివి జగదీష్ (27) కారులో ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా, ముందున్న డీసీఎం అకస్మాత్తుగా మళ్లడంతో కారు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ యాదగిరి మృతి చెందాడు. గణేష్, జగదీష్ చికిత్స పొందుతున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో డీసీఎం డ్రైవర్ తాళ్ల నిరంజన్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఘనంగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు జెల్ల వెంకటేశం జన్మదిన వేడుకలు

రామన్నపేట, అక్టోబర్ 3 (జనంసాక్షి):

జిల్లా కాంగ్రెస్ నాయకుడు జెల్ల వెంకటేశం జన్మదిన వేడుకలను పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ విశ్రాంతి భవనంలో జెల్ల వెంకటేశం ను పార్టీ నాయకులు శాలువా కప్పి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఉప సర్పంచ్ మోటె రమేష్ మాజీ ఎంపిటిసి సాల్వేర్ అశోక్, గుత్త నర్సిరెడ్డి, బొడ్డు సాలయ్య, మొహమ్మద్ నాసర్, గోదాస్ శ్రీమన్నారాయణ, మొహమ్మద్ అక్రమ్, కేశవదాస్ వెంకటేశం, కోట సుధాకర్, సాల్వేర్ లింగం, బొడ్డు శంకరయ్య, కొండ శేఖర్ గౌడ్, కొమ్ము శేఖర్, గొరిగె శేఖర్, గొలుసుల ప్రసాద్, మొహమ్మద్ రిజ్వాన్ మిర్జా ఇనాయ తుల్లా బేక్, ముహమ్మద్ అజార్, మహమ్మద్ జానీ, లవణం సాయి, సైదాచారి, కక్కిరేణి రవీందర్, తెల్ల ప్రసాద్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జువాజీ శ్రీకాంత్ పట్టణ మహిళా అధ్యక్షురాలు భైరబోయిన శోభ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సర్పంచ్‌ను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

## - నారాయణపురం ఎస్ఐ, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్

**సంస్థాన్ నారాయణపురం: అక్టోబర్ 3.( జనం సాక్షి):**

అల్లందేవిచెరువు గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి సుర్వి సౌజన్య రాజు గౌడ్ గారిని బహిరంగంగా అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ, అవమానిస్తూ, అధికారిక విధుల నిర్వహణకు ఆటంకం కలిగిస్తూ,అనుమతి లేకుండా వీడియోలు తీస్తూ వేధింపులకు పాల్పడుతున్న సుర్వి లింగస్వామిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సంస్థాన్ నారాయణపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ కి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఓఖఆ) కి ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 136లోని పాత ఊరుకు సంబంధించిన అంశంపై అధికారుల ద్వారా సర్వే నిర్వహించి, గ్రామ పాత ఊరును కాపాడాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినప్పటి నుంచి సుర్వి లింగస్వామి తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.గతంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తనను అవమానించే విధంగా వ్యవహరించడంతో పాటు, గ్రామంలో వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక కాలువ మార్గాన్ని పూడ్చివేసి సమస్యను సృష్టించి, అనంతరం తనపై పత్రికా ప్రకటనలు ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.అదేవిధంగా గతంలో నిర్వహించిన గ్రామసభలో కూడా సుర్వి లింగస్వామి అసభ్యకరమైన పదజాలంతో తనను, అధికారులను దూషించినట్లు ఆమె తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో కూడా మద్యం సేవించి తనను బహిరంగంగా దూషిస్తూ,తన భర్త సుర్వి రాజు గౌడ్‌ను సైతం దూషిస్తూ సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక మహిళా ప్రజాప్రతినిధిగా గ్రామసభలు, గ్రామపంచాయతీ కార్యక్రమాల్లో విధులు నిర్వహిస్తున్న తనను పదేపదే అవమానిస్తూ, వేధించడం వల్ల తీవ్ర భయాందోళనకు గురవుతున్నానని సుర్వి సౌజన్య రాజు గౌడ్ తెలిపారు.ఈ ఘటనలపై సంస్థాన్ నారాయణపురం ఎస్ఐ , ఎంపీడీవో సమగ్రంగా విచారణ జరిపి, సంబంధిత వ్యక్తిపై వర్తించే చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యుద్ధాలతో మానవాళికి తీవ్ర నష్టం




**సూర్యాపేట (జనంసాక్షి):**

యుద్ధం వలన మానవాళికి అంతులేని నష్టం జరుగుతుందని, యుద్ధం వలన ప్రాణహానితోపాటు భవిష్యత్ తరాలు తీవ్రంగా దెబ్బతింటాయని అఖిల భారత సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది కెవిఎల్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మాండపల్లి ప్రభాకర్ ఫంక్షన్ హాల్ లో ఆ సంఘం జిల్లా నాలుగో మహాసభలో పాల్గొని మాట్లాడారు.వ్యక్తి ఆలోచన మూలంగానే శాంతి గాని యుద్ధం గాని వస్తాయని, చెడు ఆలోచన అనేది ప్రపంచాన్ని వేరు చేస్తుందని అన్నారు.సామ్రాజ్యవాద కాంక్షతో అమెరికా వంటి దేశాలు ప్రపంచంలోని చిన్నచిన్న దేశాలను ఆక్రమించాలని చూస్తున్నాయని అన్నారు.ఇరాన్ పై యుద్ధం వలన ఇరాన్ లో వేలాది మంది క్షతగాత్రులవడం, చిన్నారులు చనిపోవడం, అంగ వికలాంగులు కావటం జరిగిందని తెలిపారు.ఆహార పదార్థాల కొరత,అవసరమైన నిత్యవసర మందులు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, యుద్ధం మానవాళికి మంచిది కాదని పేర్కొన్నారు. అంతకు ముందు జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ చేశారు.అనంతరం మహాసభ అధ్యక్షులు తోగిటి మురళి, బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, పుట్టపాక అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో డాక్టర్ సమత, వై.వెంకటేశ్వర్లు, మందారి డేవిడ్ కుమార్, గుడిపూడి వెంకటేశ్వరరావు, తలమల్ల హస్సేన్, నాతి సవేంద్ర కుమార్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, అనంతుల మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారాం, ఖమ్మంపాటి రాము, దంతాల రాంబాబు, ఎడెల్లి శ్రీకాంత్, గొద్దలి నరసయ్య, తాళ్లపల్లి సత్యనారాయణ, దూలం నగేష్, దికొండ శ్రీనివాస్, పొన్నం రమేష్, గాలి రామకృష్ణ, నాతి లీలావతి, భూపాల్,బత్తుల నరసయ్య, సొరెడ్డి వెంకటరెడ్డి, చిలకరాజు శ్రీను, దాయం ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాటన్ పరిశ్రమ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలి

## యాదాద్రి భువనగిరి జిల్లా కాటన్ మిల్లర్స్, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం







**భువనగిరి, అక్టోబర్ 3 (జనంసాక్షి)**
కాటన్ మిల్లర్లు, ట్రేడర్లు ఐకమత్యంతో ముందుకు సాగుతూ అసోసియేషన్‌ను మరింత పటిష్టం చేయడంతో పాటు కాటన్ పరిశ్రమ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్ పిలుపునిచ్చారు.
యాదాద్రి భువనగిరి జిల్లా కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం న్యూ వివేరా హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్ హాజరయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా కట్కూరి నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా బొడిగం సాయి కుమార్, కోశాధికారిగా బెల్దే శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్ మాట్లాడుతూ కాటన్ మిల్లర్లు, ట్రేడర్లు ఒకే వేదికపైకి వచ్చి తమ సమస్యలను సమష్టిగా పరిష్కరించుకోవాలని సూచించారు. తెలంగాణలో కాటన్ పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పత్తి రైతులు, మిల్లర్లు, వ్యాపారుల మధ్య సుహృద్భావ వాతావరణం కొనసాగేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. కాటన్ పరిశ్రమ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో నూతన జిల్లా కమిటీ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నూతన అధ్యక్షుడు కట్కూరి నాగభూషణం మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు. జిల్లాలోని కాటన్ మిల్లర్లు, ట్రేడర్ల సంక్షేమంతో పాటు కాటన్ పరిశ్రమ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అందరి సహకారంతో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కాటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొడవర్తి శ్రీనివాస్ రావు, నందిని శ్రీనివాస్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రేగురి వెంకన్న, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జిల్లా శ్రీనివాస్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి కాటన్ మిల్లర్లు, ట్రేడర్లు, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్పీఆర్ హైస్కూల్‌పై డీఈవో హెచ్చరిక

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 2, (జనంసాక్షి):** ఎస్పీఆర్ హైస్కూల్ పేరు మార్పు ప్రతిపాదనలు 45 రోజులు గడిచినా సమర్పించకపోవడంపై జిల్లా విద్యాశాఖాధికారి పి. సుశీంద్ర రావు తీవ్రంగా స్పందించినట్లు ఆర్టీఐఎస్ఎస్ నాయకులు కేతావత్ బాబురామ్ నాయక్, కలకుంట్ల వినోదాచారి తెలిపారు. 'ఎస్పీఆర్' పేరును ఉపయోగించకుండా కొత్త పేరు కోసం ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని డీఈవో ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆదేశాలు పాటించకపోతే కరస్పాండెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాల గుర్తింపు రద్దుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని హెచ్చరించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు అనుమతులు, గుర్తింపుపై స్పష్టత లేని పాఠశాలలో పిల్లలను చేర్పించవద్దని సూచించారు.

# ఎంఎస్ఎఫ్ జాతీయ సదస్సును జయప్రదం చేయాలి

## మోటకొండూరులో పోస్టర్ ఆవిష్కరణ

## ఉస్మానియా వర్సిటీ వేదికగా అక్టోబర్ 6న విద్యార్థి సదస్సు



**మోటకొండూరు, అక్టోబర్ 3 (జనంసాక్షి):**
అక్టోబర్ 6న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న ఎంఎస్ఎఫ్ జాతీయ విద్యార్థి సదస్సును విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు కొంపల్లి పరశురాం మాదిగ పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం మోటకొండూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరశురాం మాదిగ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో స్టూడెంట్ ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేసే దిశగా ఈ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓయూలో జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బొట్ల నరసింహ మాదిగ, ఎంఆర్పీఎస్ మండల ఇన్‌చార్జి ఆడెపు శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు గంధమల్ల నరసింహ, పట్టణ కార్యదర్శి బొట్ల సురేష్, మండల సహాయ కార్యదర్శి బొట్ల నవీన్ మాదిగ, నాయకులు బొట్ల నరేష్ మాదిగ, వంగపల్లి మొగులయ్య, బొట్ల సాయిలు మాదిగ, బొట్ల లక్ష్మయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# అర్వపల్లి ఆలయంలో పూజలు

## ఎమ్మెల్సీ ప్రచారం ప్రారంభం

**జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 3 (జనం సాక్షి):**
అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం నాలుగు తరాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయంగా ఉందన్నారు. పార్టీ అధిష్టానం తన అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా ఖరారు చేసిందని తెలిపారు. పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, గ్రామగ్రామాన హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీగా వెళ్లి వై జంక్షన్‌లో తన తండ్రి దామోదర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ శ్రేణులు, ఆర్డీఆర్ అభిమానులు భారీగా పాల్గొన్నారు.



# నానో యూరియాతో అధిక దిగుబడులు సాధించాలి

## పల్లెపహాడ్‌లో నానో యూరియా ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు

**జనంసాక్షి అక్టోబర్ (03) ఆత్మకూర్ (ఎం)**
నానో యూరియా వినియోగంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడంతో పాటు పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఓయా) శ్రీనివాస్ అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకంలో భాగంగా పల్లెపహాడ్ గ్రామంలో రైతు గజ్జెల్లి శంకరయ్య పొలంలో నానో యూరియా వినియోగంపై ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నానో యూరియా నిల్వ, రవాణాకు సులభంగా ఉండటంతో పాటు కూలీల ఖర్చును తగ్గిస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు భూమి సహజ సమతుల్యతను కాపాడుతుందని పేర్కొన్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తికి, రైతుల ఆదాయం పెంపునకు నానో యూరియా వినియోగం ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అంబటి వేణు, గ్రామ సర్పంచ్ సుంకరి మంజుల, సుంకరి పరశురాములు, రైతులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ ప్రయాణికులకు ఆన్ లైన్ సౌకర్యం

## కే. సురేష్ కుమార్ యాదగిరిగుట్ట డిపో మేనేజర్



భువనగిరి, అక్టోబర్ 3(జనం సాక్షి)
యాదగిరిగుట్ట నుండి దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆన్ లైన్ లో టికెట్లు బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కే. సురేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కే. సురేష్ కుమార్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం వరకు డీలక్స్ బస్సులు నడుపుతున్నామని ఆయన అన్నారు. ప్రతి రోజూ ఉదయం 6.00 గంటలకు యాదగిరిగుట్ట డిపో నుండి బయలుదేరి, 06.20 నిముషాలకు భువనగిరి, 06.45 నిముషాలకు ఘటకేసర్, 07.15 నిముషాలకు ఉప్పల్/నల్లచెరువు ద్వారా మహాత్మా గాంధీ బస్ స్టేషన్ ద్వారా శ్రీశైలం వెళుతుందని ఆయన అన్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసు రిజర్వేషన్ నెం.×1915× ద్వారా బుక్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. శ్రీశైలం నుండి సాయంత్రం 15.45 నిముషాలకు బయలుదేరి తిరిగి యాదగిరిగుట్ట కు వస్తుందన్నారు. అదే విధంగా,యాదగిరిగుట్ట నుండి రాయచూర్ కు 12.30, 15.00, 15.45, 16.30 మరియు 17.00 గంటలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు నడుపుతున్నామని ఆయన అన్నారు. ప్రతి డీలక్స్ బస్సు భువనగిరి, ఘట్కేసర్, ఉప్పల్, హైదరాబాద్ (ఎం.జీ.బీ.ఎస్), మహబూబ్ నగర్, మక్తల్ ద్వారా రాయచూర్ వెళ్లి మరుసటి రోజు యాదగిరిగుట్ట కి వస్తుందన్నారు. ఈ బస్సుల ఆన్ లైన్ రిజర్వేషన్ల కొరకు ఫోన్ నంబర్ ×9063404773× ను సంప్రదించాలని ఆయన తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ
యాదగిరిగుట్ట డిపో

యాదగిరిగుట్ట, భువనగిరి, ఘట్కేసర్ పట్టణ మరియు పరిసర గ్రామ ప్రజలకు తెలియజేయునది

ప్రయాణీకుల సౌకర్యార్థం యాదగిరిగుట్ట డిపో నుండి ప్రతిరోజు శ్రీశైలం, రాయచూర్ కు బస్సులు నడుపుచున్నాము. ఇట్టి సర్వీసులకు TGSRTCBUS.IN లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడినది మరియు యాదగిరిగుట్ట, రాయగిరి, భువనగిరి, ఘట్కేసర్, ఉప్పల్ నల్లచెరువు వద్ద ప్రయాణీకులు బస్సు ఎక్కుటకు అవకాశం కల్పించబడినది.

**యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం**

| యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం | | | | | శ్రీశైలం నుండి యాదగిరిగుట్ట | |
|---|---|---|---|---|---|---|
| Reservation Service Number | యాదగిరిగుట్ట నుండి | భువనగిరి నుండి | ఘట్కేసర్ నుండి | ఉప్పల్ నల్లచెరువు నుండి | Reservation Service Number | శ్రీశైలం నుండి |
| 1914 | 6:00 | 6:20 | 6:45 | 7:15 | 1915 | 15:45 |

**యాదగిరిగుట్ట నుండి రాయచూర్**

| యాదగిరిగుట్ట నుండి రాయచూర్ | | | | | రాయచూర్ నుండి యాదగిరిగుట్ట | |
|---|---|---|---|---|---|---|
| Reservation Service Number | యాదగిరిగుట్ట నుండి | భువనగిరి నుండి | ఘట్కేసర్ నుండి | ఉప్పల్ నల్లచెరువు నుండి | Reservation Service Number | శ్రీశైలం నుండి |
| 1918 | 12:30 | 12:50 | 13:15 | 13:45 | 1919 | 21:30 |
| 1921 | 15:00 | 15:20 | 15:45 | 16:15 | 1922 | 04:00 |
| 1930 | 15:45 | 16:05 | 16:30 | 17:00 | 1931 | 04:40 |
| 1910 | 16:30 | 16:50 | 17:15 | 17:45 | 1911 | 05:20 |
| 1968 | 17:15 | 17:35 | 18:00 | 18:30 | 1969 | 06:00 |

పెళ్లిళ్లకు, శుభకార్యాలకు మరియు టూర్లకు అద్దెకు బస్సులు ఇవ్వబడును.
ఇట్టి అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోగలరు.
-డిపో మేనేజర్, యాదగిరిగుట్ట.

# అక్టోబర్ 16న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 3 ( జనంసాక్షి):** యస్ఆర్ డబిజీ యస్ ఆర్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఈనెల 16న కళాశాల సమావేశం హాలులో నిర్వహించాలని యస్ఆర్ డబిజీయస్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సమావేశం తీర్మానించింది.సమావేశంవివరాలు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్య దర్శులు నల్లమోతు తిరుమల రావు,వి ఆనంద్ కుమార్లు పత్రిక లకు వెల్లడించారు. ఈనెల16 శుక్రవారం రోజున ఉదయం 10గంటలనుండి సాయంత్రం 5గంటల వరకు పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వ భావించబడుతుందని వారు తెలిపారు.ప్రముఖ స్థానాల్లో ఉండి ప్రతిభ కనబర్చిన కళాశాల పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు 16మంది ప్రముఖులను ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.రాజకీయం, జర్నలిజం, సామాజికం, వ్యాపారం,న్యాయం విధానం, ఉద్యమాలు, వైద్యరంగం, విద్యా రంగం లలో రాణించిన పలువురు పూర్వ విద్యార్థులకు సన్మానం కార్యక్రమం ఉంటుందని వెల్లడిం చారు. ప్రతి ఏటా ఈకార్యక్రమం నిర్వహిం చాలని నిర్ణయించింది. అదేవిదంగా పూర్వ విద్యార్థుల కార్యవర్గం గతసమావేశం నుండి ఇప్పటివరకు మరణించిన పూర్వ విద్యార్థులు కుటుంబానికి బస్వనారాయణ, రాయల చం ద్రశేఖర్,చల్లా శంకర్,చావా శ్రీహరి, ఇల్లూరి సైదులుతదితరులకు సమావేశం నివాళులు అర్పించి సంతాపం ప్రకటించింది. ఈ అపూర్వ సమ్మేళనంకు కళాశాల పూర్వ విద్యార్థులు అందరూ హాజరుకావాలని సమావేశం కోరింది. ఈసమావేశంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మణిభూషనాచారి, ఇదేంటి శ్రీనివాస్,చిన నర్సయ్య,దగ్గులు మాధవరెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి జూనియర్ కబడీ పోటీలకు

# కల్లూరు క్రీడాకారులు ఎంపిక

**కల్లూరు అక్టోబర్ 3 (జనంసాక్షి):** ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ కబాడీ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి కల్లూరు క్రీడాకారుల ఇద్దరు తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఈనెల 2 నుంచి 6 వ తారీకు వరకు రాష్ట్రస్థాయి జూనియర్ కబాడీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలో పాల్గొనేందుకు కల్లూరు కు చెందిన శీలం శ్రీరామ్. . రాయల రాకేష్. ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనారు. నిరుపేద కుటుంబానికి చెందిన క్రీడాకారుల తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన కబడ్డీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి జూనియర్ కబడి పోటీలలో పాల్గొనేందుకు ఎంపిక కావడం పట్ల ఖమ్మం జిల్లా యువజన , క్రీడల అభివృద్ధి శాఖ అధికారి తంబూరు సునీల్ రెడ్డి . ఖమ్మం జిల్లా కబాడీ అసోసియేషన్ అధ్యక్షులు తుంబూరు దయాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కటికల క్రిస్టఫర్ బాబు . కబడ్డీ శిక్షకులు శ్రీనివాస్. తోటి క్రీడాకారులు కల్లూరు గ్రామ పెద్దలు ప్రజలు అభినందించి ఆశీర్వదించి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఇరువురు క్రీడాకారులు గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం కల్లూరులో వ్యాయామ ఉపాధ్యాయులు పసుపులేటి వీరరాఘవయ్య పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు.



## ఇంద్లాతండా గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 03 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున ఇల్లందు సబ్‌డివిజన్ పోలీసు సిబ్బంది, టీజీఎస్‌పీ సిబ్బందితో కలిసి కొమరారం గ్రామపంచాయతీ పరిధిలోని ఇంద్లాతండా గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. 30 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోల ధ్రువ పత్రాలు పరిశీలించి సరియైన ధ్రువ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వి నియోగం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరి స్తున్నట్లు గుర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అలాగే గంజాయి వంటి



అక్రమ మాదకద్రవ్యాల విక్రయాలు, నిల్వలు, గుడుంబా తయారీ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియ జేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు, విలువైన మరియు విశ్వసనీయ సమాచారాన్ని అందించిన వారికి తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, టీజీఎస్‌పీ సిబ్బంది కలిపి మొత్తం 60 మంది పోలీసులు పాల్గొన్నారు.





**ఉచిత మంచినీటి శుద్ధి కేంద్రం ప్రారంభించిన డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి**

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో వాకిటి లక్ష్మమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాకిటి బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ వాకిటి జంగారెడ్డి ఏర్పాటు చేసిన నూతన ఉచిత మంచినీటి శుద్ధి కేంద్రాన్ని డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ జగన్, సర్పంచ్ మునుకుంట్ల నరేష్‌గౌడ్, మాజీ సర్పంచులు పకీర్ లావణ్య, దేవేందర్‌రెడ్డి, మునుకుంట్ల శ్రీనివాస్‌గౌడ్, నాంపల్లి రవీందర్‌రెడ్డి, నోముల శోభ, శ్రీనివాస్‌రెడ్డి, మర్రి బుచ్చిరెడ్డి, గుర్రం శ్రీధర్‌రెడ్డి, వార్డు సభ్యులు వంగూరి స్వామి, శ్రీకాంత్, కళ్యాణి, కృష్ణారెడ్డి, మల్లేష్, నవనీత, విజయ, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కారు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

**పెద్దవూర అక్టోబర్ 3 (జనంసాక్షి )**
రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద సంఘటన పెద్దవూర మండలంలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. కుంకుడు చెట్టు తండాకు చెందిన రమావత్ సామ (62) వృత్తిరీత్యా రైతు. శనివారం సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో తండా సమీపంలోని ఔఊ-565 రహదారిని నడుచుకుంటూ దాటుతున్న క్రమంలో నాగార్జునసాగర్ వైపు నుంచి హాలియా వైపు వెళ్తున్న ఒక కారు వేగంగా, అజాగ్రత్తగా వచ్చి అతడిని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సామను వెంటనే చికిత్స నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పెద్దవూర ఎస్ఐ గోపాలరావు తెలిపారు.



## డాక్టరేట్ సాధించిన కప్రాయిపల్లి వాసి బుంగ దాశమ్మ

**ఆత్మకూర్(ఎం) (జనంసాక్షి):**
మండలంలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన బుంగ దాశమ్మ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ డిగ్రీని సాధించారు. విశ్వవిద్యాలయ చరిత్ర విభాగం ప్రొఫెసర్ బి. లావణ్య పర్యవేక్షణలో “తెలంగాణ రాష్ట్ర జానపద కళలు మరియు చేతివృత్తులు ? ప్రాచీన, ఆధునిక పర్యాటక ఉత్పాదనగా విశ్లేషణ” అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించినందుకు ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా దాశమ్మ తన పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన ప్రొఫెసర్ బి. లావణ్యతో పాటు తన తల్లిదండ్రులు బుంగ వెంకయ్య, మాణెమ్మ, సోదరులు పరశురాములు, అశోక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతమైన కప్రాయిపల్లి నుంచి డాక్టరేట్ సాధించిన దాశమ్మను పరిశోధకులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు అభినందించి శు భాకాంక్షలు తెలిపారు.




# లంబాడీ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలి

**○నామినేటెడ్ పదవుల్లోనూ సముచిత ప్రాధాన్యం కల్పించాలి**

**○పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్‌కు లంబాడీ నేతల విజ్ఞప్తి**

**సూర్యాపేట (జనంసాక్షి):** రానున్న తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో లంబాడీ సామాజిక వర్గానికి మంత్రి పదవి కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లోనూ సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్లు,మేధావులు, కాంగ్రెస్ యువ నాయకులు కోరారు.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల ప్రచార కమిటీ కో కన్వీనర్ పృథ్వీరాజ్ నాయక్ జాటోత్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు.తెలంగాణ జనాభా,సామాజిక, సాంస్కృతిక రంగాల్లో లంబాడి సమాజం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం,సముచిత ప్రాతినిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజకీయ పదవుల్లో లంబాడీలకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ లంబాడీ సామాజిక వర్గానికి మంత్రి పదవి కల్పించే అంశంపై సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు.మంత్రివర్గ విస్తరణలో లంబాడీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పిస్తామని, లంబాడీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం కృషి చేస్తాయని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి దారావత్ వెంకన్న నాయక్, టీపీసీసీ రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ డాక్టర్ బానోత్ సంజయ్ నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి తేజావత్ వెంకట్ నాయక్, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు శివ రాథోడ్, ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకులు డాక్టర్ జె.బాలాకోటి నాయక్, ప్రొఫెసర్ డాక్టర్ అనంతరం, ప్రొఫెసర్ డాక్టర్ మొహినుద్దీన్, టీపీసీసీ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వద్యా రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

